క్లుప్తంగా

అనంతభోగేశ్వరుడికి రుద్రాభిషేకం



కొల్లూరు : వైశాఖ త్రయోదశి, మాస శివరాత్రిని పురస్కరించుకొని గంగా పార్వతి సమేత అనంతభోగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కొల్లూరు అనంతభోగేశ్వరాలయంలో స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అర్చకులు గాడేపల్లి శివశర్మ, కొమ్మూరు అనంతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పార్వతి అమ్మవారికి లక్ష మల్లెల పూజ



కొల్లూరు: వైశాఖ మాసాన్ని పునస్కరించుకొని పార్వతి అమ్మవారికి లక్ష మల్లెల పూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఆలయ అర్చకులు, వేద పండితులు లక్ష మల్లెలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని దేవస్థాన కార్యదర్శి కల్లూరు వెంకట సూర్యనారాయణమూర్తి, పోలేపల్లి కామశాస్త్రి, జనస్వామి గోపాలకృష్ణ మూర్తి పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా లీలా కల్యాణం



వేమూరు: వేమూరులో ప్రసిద్ధి గాంచిన రామేశ్వరస్వామి ఆలయాన్ని శ్రీశైల భక్త సేవా సమితి తెనాలి వారి ఆధ్వర్యంలో నూతనంగా తీర్చిదిద్దారు. ఆదివారం సాయంత్రం ఇక్కడ శ్రీశైల భక్త సేవా సమితి తెనాలి వారి ఆధ్వర్యంలో వైభవంగా లీలా కల్యాణం నిర్వహించారు. గంగా పార్వతీ సమేత రామేశ్వరస్వామి విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఉంచి కల్యాణం జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శివ నామ సంకీర్తన చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణానికి ఇతర గ్రామాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఇఫ్టా ఆవిర్భావ దినోత్సవం

తెనాలిటౌన్: కళను ప్రజల కోసం, ప్రజా ప్రయోజనాల కోసం ప్రదర్శించాలన్నా దృఢ సంకల్పంతో ఆవిర్భవించిన సంస్థ ఇండియన్ పీపుల్స్ థియేటర్ (ఇఫ్టా) అసోసియేషన్ అని ఉపాధ్యాయ రాష్ట్ర అవార్డు గ్రహీత ఎంవీ రఘునాథరావు పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని ఇస్కాఫ్ కార్యాలయంలో ఆదివారం ప్రజా నాట్యమండలి, అభ్యుదయ కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఇప్టా ఆవిర్భావ సభ, విప్లవ సినీ నటుడు మాదాల రంగారావు జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లిముంత కృష్ణ, నీలాంబరం, బేబి, నాగేశ్వరరావు, నాగమణి, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, ప్రభాత్, చందు పాల్గొన్నారు.

అలరించిన గానామృతం



తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సంస్థ సంకీర్తన ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఇక్కడి కొత్తపేటలోని అదితి గ్రాండ్ ఫంక్షన్‌హాలులో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్య 617వ జయంతిని నిర్వహించారు. సంకీర్తన వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు ఆధ్వర్యంలో గాయనీ గాయకులతో అన్నమయ్య కీర్తనలను భక్తిపారవశ్యంతో ఆలపించారు. డాక్టర్ పురుషోత్తమరావు అన్నమయ్య కీర్తనలను గానం చేసి, ఆహూతుల అభినందనలు అందుకున్నారు. వీరికి వయోలిన్‌పై గౌరావఝుల ఆంజనేయశాస్త్రి, కీబోర్డుపై నూతక్కి వెంకటేశ్వరరావు, మృదంగంపై కానూరి వెంకట రామకృష్ణ, తబలాపై పెరవలి వంశీకృష్ణ వాయిద్య సహకారం అందించారు. దాదాపు రెండు గంటలసేపు అన్నమయ్య కీర్తనల గానామృతంతో సంగీతాభిమానులను రంజింపజేశారు. కార్యదర్శి కె.రాజేశ్వరరావు పర్యవేక్షించారు.

కాల్వల మరమ్మతులకు శ్రీకారం

తెనాలిటౌన్: ఖరీఫ్ సీజన్ ఆరంభానికి ముందే కాల్వల మరమ్మతులు ప్రారంభించినట్లు తెనాలి ఇరిగేషన్ ఏఈ సీహెచ్ శివరామకృష్ణ తెలిపారు. దుగ్గిరాల బస్టాండ్ వద్ద నుంచి కూచిపూడి లాకుల వరకు ఉన్న కాల్వలు తెనాలి ఇరిగేషన్ కార్యాలయ పరిధిలో ఉన్నట్లు చెప్పారు. శుక్రవారం నుంచి తూర్పు కాల్వ మరమ్మతులు ప్రారంభం కాగా శనివారం నుంచి పడమర కాల్వ(మధ్య) మరమ్మతులు ప్రారంభమైనట్లు తెలిపారు. రూరల్ మండలం కొలివరం వద్ద కాల్వ కట్ట పనులు జరుగుతున్నట్లు వివరించారు.

వసతి గృహం.. నిరుపయోగం

వాడుకలో లేని అప్పికట్ల సంక్షేమ గృహం

- నెరవేరని దాతల లక్ష్యం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



వాడుకలో లేని అప్పికట్ల సాంఘిక సంక్షేమ వసతిగృహం

బాపట్లటౌన్: పేదరికంలో ఉన్నటువంటి చిన్నారులను ఒక చోటకు చేర్చి వారికి కూడు.. గూడు.. గుడ్డ తదితర సౌకర్యాలు కల్పించి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దుతామంటూ అధికారులు చెప్పిన మాటలు విన్న అప్పికట్ల గ్రామస్తులు గతంలో గ్రామంలోని ఆచంట నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడి.. వాళ్లను ఒప్పించి వసతి గృహానికి లక్షలు విలువ చేసే స్థలాన్ని ఉచితంగా ఇప్పించారు. స్థలం ఇచ్చిన తర్వాత వెంటనే లక్షలు ఖర్చు చేసి ఆ స్థలంలో భవనాలు నిర్మించి 2008లో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ప్రారంభించారు. ప్రారంభించిన తర్వాత మూడేళ్లపాటు ప్రశాంతంగా కొనసాగిన వసతి గృహం తర్వాత పిల్లలు లేక వెలవెలబోతూ వచ్చింది. ఈ విషయాన్ని గమనించిన ఉన్నతాధికారులు అసలు వసతి గృహాన్నే మూతవేసి ఇక్కడ ఉన్న విద్యార్థులను వేరే వసతి గృహానికి బదిలీ చేశారు.

బదిలీ సరే.. భవనాల సంగతేంటి..?

గ్రామానికి శివారు ప్రాంతంలో ఉన్నటువంటి వసతి గృహానికి అన్ని రకాల వసతులు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు అక్కడ ఉండి చదువుకునేందుకు ఇబ్బందిగా మారడంతో అక్కడికి వెళ్లే వారిసంఖ్య కాలక్రమేణా తగ్గింది. అన్ని వసతులు కల్పించి అదే వసతిగృహాన్ని తిరిగి ప్రారంభించాల్సిన అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకుండా విద్యార్థుల రావడం లేదనే సాకుతో వసతిగృహాన్నే మూతవేసి విద్యార్థులను, వార్డెన్‌ను వేరే వసతిగృహానికి బదిలీ చేశారు. విద్యార్థులను బదిలీ చేసి పదేళ్లు గడుస్తున్నా నేటి వరకు ఏ ఒక్కరు కూడా ఆ భవనాల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ విషయం తెలుసుకున్న దాతలు లక్షలు విలువచేసే స్థలాన్ని ఉచితంగా ఇచ్చింది నిర్దాక్షిణ్యంగా వదిలివేయటానికా అంటూ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. కనీసం భవనాలను రైతులకు ధాన్యం గోడౌన్‌ల కింద అప్పగించినా పంచాయతీకి కొంత మేర ఆదాయం అయినా వస్తుందని ఆ దిశగా ఆలోచన చేయాలని గ్రామస్తులు వాపోతున్నారు. ఆ ప్రాంతం అంతా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసే బాధ్యత గ్రామం తీసుకుంటుందంటూ గ్రామస్తులు చెబుతున్నారు.



తలుపులు, కిటికీలు ధ్వంసం చేసిన ఆకతాయిలు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా...

విద్యార్థులు లేరనే సాకుతో మూతపడిన వసతిగృహం పదేళ్లు అయినా తిరిగి ప్రారంభించకపోవడం, కనీసం ఆ భవనాలను ఎందుకు పనికిరాకుండా వదిలివేయడంతో ఇదే అవకాశంగా భావించిన కొందరు ఆకతాయిలు మధ్యాహ్నం, రాత్రి ఆ భవనాల వద్దకు చేరుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో ఏర్పాటు చేసిన వసతి గృహంపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వసతి గృహంలోని తలుపులు, కిటికీల చెక్కలతోపాటు ఐరన్ తదితర సామగ్రిని కూడా గుర్తు తెలియని వ్యక్తులు దోచుకెళ్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతిగృహాన్ని తిరిగి పునఃప్రారంభించడమా.. లేక పంచాయతీకు అప్పగించే ప్రయత్నం అయినా చేయాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.

■ ఇదిలా ఉండగా వసతి గృహం భవనాలు నిర్మానుష్యంగా ఉండటంతో విపరీతంగా చిల్లచెట్లు పెరిగిపోయి విష సర్పాలకు ఆవాసంగా మారాయి. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ విషయమై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

అప్పికట్ల వసతిగృహం నిరుపయోగంగా ఉన్న విషయం మా దృష్టికి వచ్చింది. ఇటీవల కాలంలో వెళ్ళి పరిశీలించడం జరిగింది. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ భవనాలను ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించేలా చర్యలు తీసుకుంటాం.

– రాజా దెబోరా,
డీడీ, సాంఘిక సంక్షేమ శాఖ

నేడు ప్రథమాంధ్ర మహాసభ వార్షికోత్సవం



బాపట్లటౌన్: పట్టణంలోని టౌన్ హాల్‌లో ఈ నెల 26న ప్రథమాంధ్ర మహాసభ 112వ వార్షికోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని ప్రథమాంధ్ర మహాసభ కమిటీ కో కన్వీనర్ కోట వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. పట్టణ టౌన్ హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రథమాంధ్ర మహాసభ వార్షికోత్సవం జరుగుతుందన్నారు. ఆదివారం ప్రథమాంధ్ర మహాసభపై పట్టణంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ 1913 మే 26న బాపట్ల టౌన్ హాలులో మొట్టమొదటి ప్రథమాంధ్ర మహాసభ జరిగిందన్నారు. పట్టణంలోని ప్రముఖులు, మేధావులు, విద్యావంతులు, పురప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ డాక్టర్ పీసీ సాయిబాబు, కాగిత శ్రీహరిరావు, జీవీ సుబ్రహ్మణ్యం, వీరభద్రరావు, వెంకట్రావు, సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తెనాలిఅర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు జరిగే కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

బాపట్ల: గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు సాంకేతిక పరమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో మెడికల్ క్యాంపును నిర్వహించటం జరిగిందని డాక్టర్ యజ్ఞ శ్రీకాంత్ బెల్లంకొండ పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని యజ్ఞ హాస్పిటల్‌లో కీళ్ల వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఎముకల బలహీనత అనుభవించే వారికి రూ.2,500 ఖర్చయ్యే బోన్‌మినరల్ డెన్సిటీ పరీక్షను ఉచితంగా చేసి మందులు అందించటం జరుగుతుందన్నారు. ఎముకల వైద్యులు డాక్టరు టి.పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి మందులు అందించటం సంతోషంగా ఉందన్నారు. యజ్ఞ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరాలకు నిపుణులైన వైద్యులను తీసుకువచ్చి వైద్యసేవలు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సుమారు 450 మంది పరీక్షలు చేయించుకుని మందులు స్వీకరించారని ఆయన తెలియజేశారు.



ఉచిత వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

బాపట్ల రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు జాన్‌వెస్లీ మృతి



గూడపాటి జాన్‌వెస్లీ(ఫైల్)

బాపట్ల: బాపట్ల రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు, రన్ ఫర్ జీసస్ కన్వీనర్ గూడపాటి జాన్‌వెస్లీ(59) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం ఉదయం జాన్‌వెస్లీ భౌతికకాయాన్ని విజయలక్ష్మీపురంలోని స్వగృహం వద్ద ఉంచారు. సోమవారం ఉదయం 10 గంటలకు చంగల్ రాయుడుతోటలో సమాధి కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జాన్‌వెస్లీ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తెనాలిటౌన్: కరోనా మహమ్మారి మళ్లీ విజృంభిస్తున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు సూచించారు. ఆదివారం స్థానిక మారీసుపేటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోవిడ్ మహమ్మారి దేశ వ్యాప్తంగా కోరలు చాస్తుందని వెల్లడించారు. ప్రభుత్వం అప్రమత్తమే ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ, మండల గ్రామాల్లో కోవిడ్ కిట్స్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ప్రజలు కరోనా నిబంధనలు పాటిస్తూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

యోగాతో ఎన్నో ఉపయోగాలు

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: యోగా చేయడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. యోగా ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో బోసురోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నార్త్ ఇండియాకు చెందిన కొందరూ శిక్షకులు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌వో రాంప్రసాద్, పలువురు మున్సిపల్ అధికారులు, యోగ సాధకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ రేషన్ విధానాన్ని కొనసాగించాలి



డిమాండ్ కార్డులను ప్రదర్శిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, వాహనదారులు

రేపల్లె: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయటం అమానుషమని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్ని కొనసాగించి ఎండీయూ వాహనదారులు, అసిస్టెంట్‌లకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం డిమాండ్ కార్డ్‌లను ఆవిష్కరించి మాట్లాడారు. ఇంటింటికీ రేషన్ విధానంతో రేషన్ సరుకులు కార్డుదారుల ఇంటికే చేరేవని, లబ్ధిదారులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండటంతో పాటు ఈ విధానంతో పలువురికి ఉపాధి లభిస్తుందన్నారు. ఈ విధానం రద్దు చేయటంతో కార్డుదారులు సరుకుల కోసం రేషన్‌షాపుల చుట్టూ తిరుగుతూ గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటాయన్నారు. సంవత్సరాలుగా వాహనాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఎండీయూ వాహనదారులు, అసిస్టెంట్‌లు ఉపాధి కోల్పోయి రోడ్డునపడే ప్రమాదం ఉందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలను తొలగిస్తూ కార్మికుల పొట్ట కొడుతోందని విమర్శించారు. రాజకీయ కోణంలో కాకుండా ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఎండీయూ వాహనాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎండీయూ వాహనదారుల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు గోరిపర్తి గోపి, సభ్యులు టి.రవి, అంజన్‌కుమార్, ఎస్‌కే రసూల్, మధుసూధనరావు తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అమర్తలూరు(వేమూరు): పాఠశాలకు అభివృద్ధికి తమ వంతు సహకారం పూర్తిగా ఉంటుందని పూర్వ విద్యార్థులు తెలిపారు. అమర్తలూరు మండలంలోని గోవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2002–03 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి చదువు నేర్పిన పూర్వ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు సురా రెడ్డి, సాంబశివరావు, ప్రేమచంద్, పోతురాజు, నాగరాజ కుమారి, అపర్ణా, లక్ష్మీ, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు శివ శంకర్ పాల్గొన్నారు.

31న శ్రీపార్వతీ సమేత ఓంకారేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్ట

తెనాలి: స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఓంకారాశ్రమం ప్రాంగణంలో నిర్మించిన పరివార దేవతా, శిఖర, ధ్వజస్తంభ, శ్రీశరభ సాళ్వేశ్వరస్వామి, శ్రీపార్వతీ సమేత శ్రీఓంకారేశ్వరస్వామి వార్ల ప్రతిష్ఠా మహోత్సవం ఈనెల 31వ తేదీ ఉదయం 8.19 గంటలకు జరగనుంది. శ్రీఅవధూత వద్ద పీఠ ఆస్థాన విద్వాన్ బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి మృత్యుంజయప్రసాద్ శివాచార్య ఆధ్వర్యంలో శైవాగమ సంప్రదాయ పద్ధతిలో త్రయాహ్నిక దీక్షతో జరుపనున్నారు. ఆదివారం ఆలయం వద్ద సంబంధిత ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రతిష్ఠా మహోత్సవంలో గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కామినేని బసవశ్రీనివాసరావు పాల్గొంటారు. ఆధ్యాత్మిక ప్రముఖులైన తాళ్లాయపాలెం శైవపీఠాధిపతి శ్రీశివస్వామి, రుద్రప్రయాగ, ఉత్తరాఖండ్ నుంచి సంతు సదానంద్ గిరి బాబా, సంతు సదానంద, ఒంగోలు గౌరావధ్యక్షురాలు శ్రీమహావిద్యానందగిరి మాతాజీ మాజరవుతారని ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రతిష్ఠా మహోత్సవాలు 29 నుండి ఆరంభిస్తున్నట్టు తెలిపారు. 31వ తేదీన పెద్దసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రూప్–2 దేవాలయాల కార్యనిర్వహణాధికారి హరిప్రసాద్, సహస్ర ప్రతిష్ఠాపకులు మామిళ్లపల్లి మృత్యుంజయప్రసాద్, దేశబోయిన మహేశ్వరరావు, గోపిశెట్టి నాగేశ్వరరావు, ఆదెన కృష్ణ, తాడిబోయిన అనిల్, తాడిబోయిన గోపి, అర్చకుడు స్వర్ణ వెంకట నాగకుమార్‌శర్మ పాల్గొన్నారు.



ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

గాలి వానకు రహదారిపై కూలిన వృక్షం



రాకపోకలకు అంతరాయం

కొల్లూరు : తీవ్రమైన గాలులతో కూడిన వర్షం కారణంగా భారీ వృక్షం రహదారికి అడ్డంగా కూలిన సంఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. శనివారం రాత్రి పెనుగాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో మండలంలోని దోనేపూడి లక్ష్మీతిరుపతమ్మ ఆలయం వద్ద రేపల్లె – తెనాలి ప్రధాన రహదారికి అడ్డంగా చెట్టు కూలిపోయింది. రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఆదివారం ఉదయం తొమ్మిది గంటల వరకు అధికారులు రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షం తొలగించకపోవడంతో ప్రధాన మార్గమైన రహదారిలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిట్టచివరకు స్థానికుల సహకారంతో రోడ్డుపై పడిన చెట్టును తొలగించడంతో ఆదివారం వాహనాల రాకపోకలు యథాతథంగా జరిగాయి.

వైభవంగా కారుమూరమ్మ తిరునాళ్ల



పూజలందుకుంటున్న కారుమూరమ్మ అమ్మవారు



ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు

చెరుకుపల్లి: పొన్నపల్లి గ్రామంలో కొలువుదీరిన కారుమూరమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుండే మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభులు, కోలాట భజనలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆపరేషన్ సిందూర్ కార్యక్రమాన్ని ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రదర్శించారు. ఆలయానికి భక్తులు సంఖ్య పెరగటంతో అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఒంటరి వృద్ధురాలి ఇంట్లో చోరీ

తెనాలిరూరల్: ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలి ఇంట్లో చోరీపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన 88 ఏళ్ల పాలడుగు కృష్ణకుమారి కుమార్తె, కుమారుడికి వివాహాలు అయి వేరుగా ఉండడం, ప్రభుత్వోపాధ్యాయుడిగా పని చేసి రిటైరైన భర్త గతంలో మృతి చెందడంతో ఇక్కడి ఓ అపార్ట్‌మెంట్‌లో ఒంటరిగా నివసిస్తోంది. ఇటీవల తన కుమార్తెకు ఉన్న పొంతంకు సంబంధించిన కౌలు డబ్బులు రూ. 98 వేలు, తనకు వచ్చే భర్త పింఛన్ నగదును ఇంట్లో ఉంచింది. శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్త వచ్చి తాను ఓ సబ్బుల కంపెనీ ప్రతినిధినని, శాంపిల్ సబ్బులను అందరికీ ఇస్తున్నామని చెప్పి మాటలు కలిపాడు. ఇంతలో పాలు పొంగుతుండడంతో కిచెన్‌లోనికి కృష్ణకుమారి వెళ్లి రాగా సదరు వ్యక్తి కనబడకుండాపోయాడు. కొద్ది సేపటి తర్వాత అనుమానం వచ్చి ఇంట్లోని షెల్ఫ్‌లో చూడగా తాను ఉంచిన నగదు లేదు. దీంతో తన బంధువైన మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఇతర బంధువులకు బాధితురాలు విషయాన్ని తెలిపారు. శివకుమార్ తన అనుచరులను ఆమె వద్దకు పంపి ఆమె ద్వారా డయల్ 112కు ఫోన్ చేయించారు. టూ టౌన్ పోలీసులు వృద్ధురాలి ఫ్లాట్ వద్దకు వెళ్లి పరిశీలించి ఆమె వద్ద ఫిర్యాదు తీసుకుని రాత్రికి కేసు నమోదు చేశారు.

ఆరాధ్యుల సేవలు అభినందనీయం

తెనాలిటౌన్: పౌరాణిక నాటకాలకు సంబంధించి కళాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఆరాధ్యుల ఆదినారాయణ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక బాలాజీరావుపేటలోని కార్యాలయంలో ఆరాధ్యుల ఆదినారాయణను దుశ్శాలువా, మెమెంటోతో కళాకారులు ఘనంగా సత్కరించారు. ఇటీవల రూరల్ మండలం కొలివరంలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాల్లో ప్రదర్శించిన పౌరాణిక నాటకాలకు సంబంధించి పలువురు కొత్త కళాకారులకు ఆయన విద్య నేర్పినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సీహెచ్ ఫణికుమార్ చౌదరి, నాయుడు గోపి, సాంబశివరావు, తాడిబోయిన నాగేశ్వరరావు, ఎం.కుమార్‌బాబు, కృష్ణారావు, ఎ.అశోక్‌కుమార్, రామలింగేశ్వరరావు, బ్రహ్మాజీ, శంకరరావు, చంద్రమౌళి, చందు సూర్య, మున్నంగి శ్రీనివాసరావు ఉన్నారు.

ముగిసిన విరామ బైబిలు తరగతులు



వేమూరు: రక్షణ సైన్యం చర్చి ఆధ్వర్యంలో పిల్లలకు నిర్వహించిన విరామ బైబిలు తరగతులు ఆదివారంతో ముగిసాయని మేజర్ డి.బాబురావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు బైబిలు తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. 230 మంది విద్యార్థులకు తరగతులు నిర్వహించి వారికి సర్టిఫికెట్‌లు ఆదివారం అందించడం జరిగిందని, దీంతో తరగతులు ముగిసాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం డైరెక్టర్ దొప్పలపూడి జ్యోతిబాబు, పిల్లలు పాల్గొన్నారు.